RNI NO: TELTEL/2023/87917

# జనం వెలుగు

www.janamvelugu.com, janamvelugu2023@gmail.com

అనునిత్యం అక్షరసత్యం

సంపుటి: 03 సంచిక: 37 గురువారం 24 ఏప్రిల్ 2025 ఎడిటర్: సీతార్ల సురేష్ పేజీలు: 8

విలేఖర్లు కావలెను

జనం వెలుగు న్యూస్ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలనుండి జిల్లా మరియు మండల విలేఖరులు కావలెను

ఆసక్తి కలవారు వెంటనే సంప్రదించండి

9603322119

## అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు చేస్తున్న ఎంఎల్ఏ

**సోషల్ మీడియాకే పరిమితమైన ఆర్మూర్ ఎమ్మెల్యే**

**గెలిచిన నాటి నుండి ఆర్మూర్ నియోజకవర్గాన్ని కన్నెత్తి చూడలేని రాకేష్ రెడ్డి**

**సోయిలేని మాటలు మానుకో అంటూ హెచ్చరించిన వినయ్ రెడ్డి**

**జనం వెలుగు, ఆర్మూర్:–** ఆర్మూర్ నియోజక వర్గంలో కాంగ్రెసు పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే ఆర్మూర్ ఎంఎల్ఏ పైడి రాకేష్ రెడ్డి కాంగ్రెస్ నాయకులపై విమర్శలు చేస్తున్నాడని ఆర్మూర్ నియోజకవర్గపు కాంగ్రెసు పార్టీ ఇంచార్జి వినయ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆర్మూర్ పట్టణంలోని పివిఆర్ భవన్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావే శంలో ఆయన మాట్లాడాడు. రాష్ట్రంలో కాంగ్రెసు ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల నుండి కాంగ్రెస్ ప్రభుత్వ ఆదేశానుసారం ప్రజలతో తత్సంబంధాలను పెంచుకుని ముందుకు వెళ్తూ, ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు తోడ్పాటు ను అందిస్తున్నానని ఆయన చెప్పాడు. గడిచిన 10 ఏండ్లు జీవన్ రెడ్డి ఆగడాలకు ప్రజలు భయ ఆందోళ నకు గురయ్యారని ఆయన అన్నాడు. సోషల్ మీడియాలో మాత్రమే కనిపించే రాకేష్ రెడ్డి బోగస్ కంపెనీ అని ప్రజలు ఇప్పటికే తేల్చారని ఆయన తెలిపాడు. పేద ప్రజలను, కుల సంఘాలను ఇంటి గేటు లోపలికి రానివ్వడనే పేరు సార్థకమైందని ఆయన అన్నాడు. ప్రతిదీ రాజకీయ కోణంలోనే ఆలోచించడం కాదని దమ్ముంటే ఎంపీ అరవింద్,కిషన్ రెడ్డి,బండి సంజయ్ లతో వాదించి కేంద్ర ప్రభుత్వ నిధులు తేవాలని ఆయన అన్నాడు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాటల ప్రకారం ఒక్క రూ పాయికే వైద్యం, గ్రామానికి 10 ఇం డ్లు ఏమయ్యాయని ఎంఎల్ఏను ఆయన ప్రశ్నించాడు. గతంలో నియోజకవర్గంలోని వెల్మల్ గ్రామాన్ని దత్తత తీసుకున్న ఎంపీ ధర్మపురి అరవింద్ ఒక కోటి నిధులు వెచ్చించారని ఆయన అన్నాడు. 15 నెలల కాలంలో ఆర్మూర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన సుమారు 50 లక్షలు నిధులు పైనే తెచ్చానని ఆయన అన్నాడు. అంకాపూర్ విడీసీ సభ్యులు ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్ ను తమ



గ్రామానికే తెచ్చే విధంగా చేయాలని నా దృష్టికి తీసుకువచ్చారని, నిజామాబాద్ జిల్లాకు అమలైన నవోదయ స్కూల్ అంకాపూర్ కు వచ్చేలా ఎంపీ అరవింద్, ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి చేయాలని ఆయన డిమాండ్ చేశాడు. సిఎం రేవంత్ రెడ్డి సహకారంతో ఆర్మూర్ కు సుమారు 50 కోట్ల రూపాయలను మంజూరు చేయించానని ఆయన తెలిపాడు. నవంబర్ మాసంలో మంత్రితో అభివృద్ధికి అవసరమైన నిధులను నేను తీసుకొస్తే ఆర్మూర్ ఎంఎల్ఏ రాకేష్ రెడ్డి జనవరి నెలలో లెటర్ పెట్టి ఆ నిధులను నేను తెచ్చానని ఎంఎల్ఏ గొప్పలు చెప్పుకొంటున్నాడని ఆయన విమర్శించాడు. రానున్న రోజుల్లో ఎంఎల్ఏ వ్యతిరేకంగా ప్రజలే నిరసన వ్యక్తం చేస్తారని ఆయన తెలిపాడు.

## ఉగ్ర దాడిలోని మృతులకు కొవ్వొత్తులతో నివాళులు

**జనం వెలుగు ఆర్మూర్:–** జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలోని పహిల్గాంలో ఈ నెల 22న ఉగ్రవాదులు జరిపిన మారణకాండకు నిరసనగా ఆర్మూర్ లో బిజెపి ఆధ్వర్యంలో బుధవారం క్రొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి ఈ దేశంలోనే చాలా పెద్ద క్రూరమైన దుశ్చర్యగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జివి నరసింహారెడ్డి అభివర్ణించాడు. జమ్మూ కాశ్మీర్ రాష్ట్రానికి వెళ్ళిన పర్యాట కులను వారి మతం ఆధారంగా కేవలం హిందూ పు రుషులని టార్గెట్ చేసుకొని వారి బట్టలు విప్పి నిర్ధారణ చేసుకొని హిందువులని కాల్చివంపడం జరిగిందని ఇది హేయమైన చర్య అని ఆయన అన్నాడు. ఇంతకు ముందు ఉగ్రదాడులకు మతంతో ఏలాంటి సంబంధం లేదని మాట్లాడిన వారికి ఇది చెంపపెట్టు లాంటిది కేవలం హిందూ ప్రతిపాదికన ఈ దాడి జరిగిందని నిర్ధారణ అయిందని, ఇప్ప టి వరకు 29 మంది హిందువులు మృత్యువాత పడ్డారని ఇంతమంది చనిపోతే ఇప్పటివరకు సెక్యులర్ పార్టీ అని చెప్పుకునే కాంగ్రెస్, బిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం, బీఎస్పీ ఇంకా ఎన్నో రంగురంగుల జెండాలు కేవలం రాజకీయం కోసమే వచ్చినటు వంటి స్వార్థపూరిత రాజకీయాలకే పరిమిత మైనాయని ఆయన అన్నాడు. సనాతన హిందూ ధర్మాన్ని నాశనం చేయడానికే రాజకీయ రంగులు పూసుకొన్నాయని కాంగ్రెసు, బిఆర్ఎస్, బిఎస్పి, సిపిఐ, సిపిఎం తథితర పార్టీలన్నీ ఉగ్రవాద చర్యలను సమర్థించే పార్టీలని ఆయన చెప్పాడు. ఈ జరిగిన ఘటన హిందువులపై జరుగక ముస్లిం, క్రైస్తవ మతాల వారిపై జరిగి ఉంటే దేశం ఇవాళ ఏ స్థితిలో ఉండేదని ఆయన ప్రశ్నించాడు. హిందువులన్న హిందు మతంపై ఈ రాజకీయ పార్టీ నాయకులకు ఎందుకు అంత కసిగా ఉంటుందని ఆయన ప్రశ్నించాడు. జరిగిన ఘటతోనే హిందువులకు వ్యతిరేకంగా పార్టీలన్నీ ఉన్నాయని స్పష్టమైందని ఏ ఒక్క పార్టీ కూడా



ఇంతవరకు ఖండించలేదంటే సిగ్గు పడాలని ఆయన అన్నాడు. హిందువులు అంటేనే వీరికి పడదని హిందువుల కోసం పోరాడే పార్టీ హిందువుల కోసం పాటుపడే పార్టీ కేవలం భారతీయ జనతా పార్టీ మాత్రమే ఈ రోజుతో స్పష్టమైందని ఆయన తెలిపాడు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, సీనియర్ నాయకులు బోట్ల విజయ్, జాగీర్దార్ శీను, పోల్కం వేణు, విజయ్ ఆనంద్, ఆర్య రాజేశ్వర్, తూర్పు రాజు, పులి యుగంధర్ కృష్ణ గౌడ్, కుక్కునూరు లింగన్న, చిట్టి బాజన్న, కలిగోట ప్రశాంత్, బాసెట్టి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయిలో ప్రతిభా మెరుపులు

**బాలనగర్ పాఠశాల విద్యార్థులకు గొప్ప గౌరవం**

**జనం వెలుగు జక్రాన్‌పల్లి:–** యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రతిభా పోటీలో జక్రాన్‌పల్లి మండలం, బాలనగర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు మాగేష్ వరుణ్ (ఐదవ తరగతి), జెండాడే సామ్రాట్ (ఏడవ తరగతి) “DEAR FUTURE ME” హస్తలిఖిత లేఖ రాసే ప్రచారంలో పాల్గొని, దేశవ్యాప్తంగా ఎంపికైన టాప్ 75 మందిలో స్థానం పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. సుసమంజసా ఈ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునిత, రేవతి, శ్రీనివాస్, విటల్, నర్సయ్య పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ వేడుకలో పాల్గొని, తమ పిల్లల విజయాన్ని గర్వంగా ఆస్వాదించారు.

### రాష్ట్ర స్థాయిలో 4 వ ర్యాంకు సాధించిన విద్యార్థిని


**జనం వెలుగు బాల్కొండ:–** మండల కేంద్రమైన బాల్కొండ పట్టణంలోని కేజిబివి స్కూల్ కు



చెందినడి రితీష సిఇసి గ్రూపులో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించిందని ఆ పాఠశాల ప్రత్యేక అధికారిణి గరిగే భవాని హర్షం వ్యక్తం చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 87 శాతం ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 90 శాతం మంది విద్యార్థినులు ఉత్తీర్ణులైన అయినారని ఆమె తెలిపారు. 90 శాతానికన్న ఎక్కువగా 22 మంది విద్యార్థినులు మార్కులు సాధించారని ఆమె అన్నారు. కళాశాల ఉత్తీర్ణత 88 శాతం రావడం పై ఆమె ఆనందంగా ఉందని అన్నారు.

### డాక్టర్ నై మంచి పేరు సాదిస్తా....

**జనం వెలుగు బాల్కొండ:–** బాల్కొండ మండలంలోని కిసాన్ నగర్ గ్రామానికి చెందిన బూస రోహిత డాక్టర్ నై,



ప్రజలకు మంచి సేవ చేస్తు మంచి పేరు సాదిస్తానని బూస రోహిత అన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపిసి విభాగంలో 1000 మార్కుల కు 951 మార్కులను సాదించి బూస రోహిత అ మ్మానాన్నల కలలను సాకారం చేయడం జరిగింది. గతంలో 10 వ తరగతిలో 9.5 మార్కులతో టాపర్ గా, నిలవడం జరిగింది. ఇ ఎంపిసి ఇటి లో మంచి ర్యాంకు సాధించి నర్సింగ్ కోర్సు పూర్తి చేసి, డాక్టర్ నై మంచి పేరు ప్రఖ్యాతలు సాదించి అమ్మానాన్నల పేరుతో పాటు, పుట్టి పెరిగిన కిసాన్ నగర్ గ్రామానికి కీర్తి ప్రతిష్టలు ఇమిడింప చేస్తానని ఆమె అన్నారు.

### రాష్ట్రస్థాయిలో రెండవ స్థానంలో రిషీత్ తేజ

**జనం వెలుగు, ఆర్మూర్:–** ఆర్మూర్ మండలంలోని పెర్కిట్ గ్రామానికి చెందిన జక్క రిషీత్ తేజ ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో, రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానాన్ని దక్కించుకున్నాడు. హైదరాబాద్ లోని శ్రీ చైతన్య కళాశాలలో బైపిసి విభా గంలో 440 మార్కులకు గాను 437 మార్కులు వచ్చాయి. అందుకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావు అభినందించాడు. రిషీత్ తేజ కృషి పట్టుదలతో కష్టపడి చదివి ఈ విజయాన్ని సాధించాడని ప్రిన్సిపాల్ తెలిపాడు. ద్వితీయ సంవత్సరం కూడా ఇలాగే కష్టపడి చదివి మంచి విజయాన్ని సాధిస్తాడని ఆశిస్తున్నా మని ఆయన తెలిపాడు. తమకు మారుడికి రాష్ట్రస్థాయిలో రెండవ స్థానం రావడం చాలా ఆనందంగా ఉందని విద్యార్థి తల్లిదండ్రులు జక్క లక్ష్మి, రమణయ్యలు ఆనందం వ్యక్తం చేశారు.

జనంవెలుగు
TELTEL/2023/87917
www.janamvelugu.com, janamvelugu2023@gmail.com
అనునిత్యం అక్షరసత్యం
గురువారం 24 ఏప్రిల్ 2025



# పండుగ వాతావరణాన్ని తలపించిన రైతు మహోత్సవం

**ఉత్సాహంగా పాల్గొన్న అన్నదాతలు**
**ఆధునిక సాగుపై సలహాలు, సూచనలు అందించిన శాస్త్రవేత్తలు, నిపుణులు**
**విశేషంగా ఆకట్టుకున్న వ్యవసాయ, అనుబంధ రంగాల స్టాళ్లు**
**నూతన సాగు పద్ధతులపై అనుభవాలను పంచుకున్న ఆదర్శ రైతులు**
**సందేహాలను నివృత్తి చేసుకున్న ఐదు జిల్లాల రైతులు**
**కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఆయా కార్పొరేషన్ల చైర్మన్ల సందర్శన**

**నిజామాబాద్, ఏప్రిల్ 23:** రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 21 నుండి మూడు రోజుల పాటు నిర్వహించిన రైతు మహోత్సవం వేడుక బుధవారం సాయంత్రం నాటితో ముగిసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేయగా, నిజామాబాద్ తో పాటు కామారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్, జగిత్యాల ఐదు జిల్లాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పండుగ వాతావరణం కనిపించింది. వ్యవసాయ, అనుబంధ రంగాలకు చెందిన 130 కు పైగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రైతులు, వారు పండించిన ఉత్పత్తులతో పాటు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తులను, ఆధునిక సాగు పరికరాలు, అధిక దిగుబడులను అందించే వంగడాలు, మేలు జాతి పాడిపశువులు తదితర వాటిని స్టాళ్లలో ప్రదర్శించగా, రైతులు ఎంతో ఆసక్తితో తిలకించారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖ శాస్త్రవేత్తలు, నిపుణులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన యూనివర్సిటీ, ఇతర వ్యవసాయ పరిశోధనా కేంద్రాల శాస్త్రవేత్తలు మూడు రోజుల పాటు కొనసాగిన వర్క్ షాపులో ఆయా అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఏ.జానయ్య, వివిధ విభాగాల అధిపతులు శ్రీలత, అంజయ్య, చంద్రశేఖర్, ప్రవీణ్, శివకృష్ణ, శాస్త్రవేత్తలు రాజ్ కుమార్, శ్వేత, రాజశేఖర్, విజయ్, స్వప్న తదితరులు వివిధ రకాల పంటల సాగులో పాటించాల్సిన మెళుకువలు, సస్య రక్షణ చర్యలు, ఆధునిక వ్యవసాయం, భూసారం పెంపుదల, అధిక దిగుబడులను అందించే వంగడాలు, తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలను సాధించేందుకు అవలంభించాల్సిన పద్ధతులు, వాణిజ్య పంటల ఎంపికకు పరిశీలించాల్సిన అంశాలు తదితర విషయాలపై సెషన్ల వారీగా రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పురస్కారాలు అందుకున్న అభ్యుదయ రైతులతో పాటు రైతు ఉత్పాదక సంస్థల ప్రతినిధులు సైతం రైతు మహోత్సవం వేదిక ద్వారా తమ అనుభవాలు పంచుకున్నారు.

## స్టాళ్లను సందర్శించిన కలెక్టర్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు

కాగా, చివరి రోజైన బుధవారం జిల్లా పాలనాధికారి రాజీవ్ గాంధీ హనుమంతుతో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి తదితరులు రైతు మహోత్సవ వేదిక, స్టాళ్లను సందర్శించారు. రైతులు, రైతు ప్రతినిధులతో మమేకం అయ్యి మూడు




రోజుల పాటు కొనసాగిన ఈ కార్యక్రమం గురించి వారి స్పందనను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మహోత్సవ వేడుక నిర్వహించడం పట్ల హర్షాతిరేకాలు వెలిబుచ్చారు. సాగు విషయాలలో అనేక నూతన విధానాలు, సరికొత్త పద్ధతులు, ఆధునిక సాంకేతికత గురించి తెలుసుకోగలిగామని, రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డు గ్రహీతలైన అభ్యుదయ రైతుల అనుభవాలతో పాటు వ్యవసాయ, ఉద్యానవన విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, సైంటిస్టులు, నిపుణులు తమ పరిశోధనా అనుభవాలను, నేటి సామాజిక వ్యవసాయక స్థితిగతులను మేళవిస్తూ అనేక అంశాలపై అవగాహన కల్పించారని, పంటల సాగులో నూతన ఒరవడికి, అధిక దిగుబడుల సాధనకు ఈ మేళా ఎంతగానో దోహదపడుతుందని గట్టి నమ్మకాన్ని వెలిబుచ్చారు.

ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన నిజామాబాద్ జిల్లాలో రైతు మహోత్సవ వేడుక నిర్వహించడం వల్ల స్థానిక రైతులతో పాటు జిల్లాకు అనుకుని ఉన్న కామారెడ్డి, జగిత్యాల, సిరిసిల్ల, నిర్మల్ జిల్లాల రైతులకు కూడా ఇది ఎంతో ప్రయోజనం చేకూర్చిందని అన్నారు. ప్రస్తుత పరిస్థితులు, సామాజిక అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ, అనుబంధ రంగాలలో శాస్త్రవేత్తలు కనుగొన్న నూతన ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సాగు రంగంలో మెళకువలు, యాంత్రీకరణ తదితర అంశాలపై సైంటిస్టులు, నిపుణులు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అభ్యుదయ రైతులు వారి అనుభవాలను తోటి రైతులతో పంచుకున్నారని అన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలతో పాటు అనుబంధ రంగాల ఉత్పత్తులకు సంబంధించిన సుమారు 130 కు పైగా స్టాళ్లను రైతులు ఎంతో ఆసక్తిగా తిలకిస్తూ, ప్రయోగాత్మక పరిశీలన ద్వారా అవగాహనను పెంపొందించుకోగలిగారని కలెక్టర్ తెలిపారు. ఇక్కడ పరిశీలించిన అంశాలను, నూతన సాగు విధానాల గురించి రైతులు గ్రామాలలో సహచర రైతులకు తెలియజేస్తూ వారిని కూడా అధిక దిగుబడుల సాధన దిశగా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ రైతు మహోత్సవానికి ఎలాంటి అవరోధాలు తలెత్తకుండా విస్తృత ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలను అందుబాటులో ఉంచామని అన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, ఉద్యానవన శాఖ సంయుక్త సంచాలకులు శ్రీనివాస్ రావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

# సైనిక దుస్తుల్లో వచ్చి మారణహోమం

జమ్మూ కాశ్మీర్‌లోని మినీ స్విట్జర్లాండ్‌గా భావించే పహల్గామ్‌లోని బైసరన్ లోయ అందాలను.. అక్కడి ప్రకృతిని చూసి ఆనందించాలని వచ్చిన పర్యాటకుల ఆశలు గల్లంతయ్యాయి. పక్కా ప్లాన్ వేసుకుని ఆర్మీ దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు.. 27 మందిని పొట్టనపెట్టుకున్నారు. మరో 20 మంది ప్రాణాల కోసం చావు బతుకుల మధ్య ఆస్పత్రుల్లో పోరాటం చేస్తున్నారు. కాశ్మీర్ అందాలను ఆస్వాదించాలని వచ్చిన ఆ టూరిస్ట్‌లు.. అచేతన స్థితిలో పడిపోయారు. ఈ క్రమంలోనే పహల్గామ్ ఉగ్రదాడికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు.. మీడియా, సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. అందులో ఒక ఫోటో ఇప్పుడు అందరి హృదయాలను కదిలిస్తోంది. ఓ వ్యక్తి మరణించగా.. అతడి పక్కనే భార్య ఏడుస్తున్న ఫోటో.. ఇప్పుడు అందరి కంట కన్నీరును పెట్టిస్తోంది.కొత్తగా పెళ్లి చేసుకుని.. హనీమూన్ కోసం జంటగా వచ్చిన ఆ ఇద్దరిలో ఇప్పుడు ఒక్కరే మిగిలారు. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో భర్త ప్రాణాలు కోల్పోగా.. ఆ మృతదేహం పక్కనే భార్య రోదిస్తున్న ఫోటో ఇప్పుడు వైరల్ కావడంతో అది అందరినీ కలచి వేస్తోంది. ఎంతో ఆనందంగా జరిగిన ట్రిప్.. ముగిసే సమయంలోనే ఉగ్రవాదుల దాడి కారణంగా ఒక్కసారిగా తారుమారైంది. హనీమూన్‌కి వచ్చిన తమపై దాడి చేశారని.. తన భర్తను దగ్గర నుంచి కాల్చి చంపినట్లు మహిళ వణుకుతున్న గొంతుతో చెప్పింది. తాను అక్కడే కూర్చుని భేల్ పూరి తింటున్న సమయంలో తన భర్త పక్కనే ఉన్నాడని.. అంతలోనే ఓ వ్యక్తి వచ్చి తన భర్తను నువ్వు ముస్లింవా అని అడిగినట్లు చెప్పింది. అందుకు తాను ముస్లిం కాదని తన భర్త చెప్పడంతో కాల్చి చంపినట్లు ఆమె కన్నీరు మున్నీరు అయింది. భర్త శవం పక్కన కూర్చుని ఉన్న ఆ యువతి ఫోటో ఇప్పుడు అందరితో కన్నీరు పెట్టిస్తోంది.అప్పటివరకు సంతోషంగా కాశ్మీర్ అందాలను, హిమాలయాలను, పచ్చటి చెట్లు, గడ్డి భూములను చూసి ప్రపంచాన్ని మైమరిపోయిన టూరిస్టులు.. క్షణాల్లోనే ప్రాణాలు విడిచారు. ఈ దాడికి లష్కరే తోయిబా ప్రాక్సీ సంస్థ అయిన "ది రెసిస్టెన్స్ ఫ్రంట్" ఉగ్ర సంస్థ బాధ్యత ప్రకటించింది. ఇక ఈ ఉగ్రదాడి తర్వాత ఆ ప్రాంతం మొత్తం భీతావహ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం అక్కడి దాడికి సంబంధించిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. తమను, తమ వారిని కాపాడాలి అంటూ కన్నీటితో అందరినీ వేడుకుంటున్న వీడియోలు కలిచివేస్తున్నాయి. "ప్లీజ్ నా భర్తను రక్షించండి" అంటూ ఓ మహిళ ఏడుస్తూ బతిమిలాడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఇక సైనిక దుస్తుల్లో వచ్చిన ఏడుగురు ఉగ్రవాదులు.. ఈ మారణహోమానికి తెరలేపినట్లు ప్రాణాలతో బయటపడిన ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. కనిపించిన వారిని కనిపించినట్లే పాయింట్ బ్లాంక్‌లో తుపాకీ పెట్టి కాల్చినట్లు పేర్కొన్నారు. అది ఒక భయానక సంఘటనగా వారు అభివర్ణిస్తున్నారు. మినీ స్విట్జర్లాండ్‌గా పిలుచుకునే అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్‌గామ్‌లోని బైసరన్ ప్రాంతం.. ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరు. దీంతో దేశవిదేశాలకు చెందిన పర్యాటకులు బైసరన్ లోయ ప్రాంతాన్ని చూసేందుకు వస్తారు. అయితే అలాంటి టూరిస్ట్‌లను లక్ష్యంగా చేసుకుని..ఆర్మీ దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు దాడి చేశారు. ఇక ఈ ఉగ్రదాడికి పాల్పడింది తామే అంటూ టీఆర్ఎఫ్ ప్రకటించింది.దాదాపు 40 మంది పర్యాటకులను చుట్టుముట్టి. అత్యంత సమీపం నుంచి కాల్పులు జరపడంతో వారు అక్కడికక్కడే రక్తపు మడుగులో పడి ప్రాణాలు విడిచారు. మతం ఏంటని. పేరు ఏంటని అడిగి మరీ కాల్పులు జరిపినట్లు పర్యాటకులు చెబుతున్నారు. ఐడీ కార్డులు ఇవ్వాలని వారిని బెదిరించినట్లు చెప్పారు. గాయపడిన క్షతగాత్రులు మహారాష్ట్ర, గుజరాత్, యూపీకి చెందిన వారుగా గుర్తించారు. పలువురు విదేశీ పర్యాటకులు కూడా మృతుల్లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరికొందరు బుల్లెట్ గాయాలతో ప్రాణాలు దక్కించుకునేందుకు ఆర్తనాదాలు చేశారు. ఇక బైసరన్ ప్రాంతంలో తుపాకీ కాల్పుల శబ్దాన్ని విన్న సైన్యం.. హుటాహుటిన అక్కడికి చేరుకుంది. హెలికాప్టర్ సాయంతో గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ బైసరన్ ప్రాంతానికి కేవలం కాలినడకన లేదా గుర్రాలపై మాత్రమే చేరుకునే అవకాశం ఉండటంతో బాధితులను వేగంగా తరలించడం సైన్యానికి కష్టతరం అయింది.మరోవైపు.. త్వరలోనే మంచు కొండల్లో పవిత్రమైన అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం కానున్న వేళ.. ఈ భారీ ఉగ్రదాడి జరగడం తీవ్ర సంచలనంగా మారింది. ఉగ్రవాద దాడి కోసం %ూ+ఔ% ఉగ్రవాదులకు బైక్‌లను అందించి ఉండవచ్చని భద్రతా సంస్థలు అనుమానిస్తున్నాయి. సంఘటనా స్థలానికి సమీపంలో లభించిన అనుమానాస్పద బైక్ ఎవరిదో తెలుసుకోవడానికి దర్యాప్తు జరుగుతోంది.పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి దేశాన్నే కాదు.. యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌కి తమ మద్దతును తెలియజేస్తున్నాయి. పహల్గామ్‌లో దాడి జరిగిన ప్రదేశం దగ్గర నంబర్ ప్లేట్ లేని నల్లటి బైక్ ఎవరిది? అనే విషయం ప్రస్తుతం చర్చణీయాంశంగా మారింది. 38 రోజుల పాటు కొనసాగే అమర్‌నాథ్ యాత్ర జులై 3వ తేదీన ప్రారంభం కానుంది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది యాత్రికులు రెండు మార్గాల్లో చేరుకోనున్నారు. అనంత్‌నాగ్ జిల్లాలో పహల్గాం మార్గంలోనే 48 కిలోమీటర్ల మేర ఉండగా.. 14 కిలోమీటర్ల మార్గం గండేర్బల్ జిల్లా నుంచి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో తాజాగా పర్యాటకులపై ఉగ్రదాడి జరగడం అమర్‌నాథ్ యాత్రికులకు తీవ్ర భయాందోళన కలిగిస్తోంది.